

ధర్మవరంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న పరిటాల శ్రీరామ్, టీడీపీ నాయకులు



గోరంట్లలో నిమ్మల కిష్టప్ప ఆధ్వర్యంలో నివాళి



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న సవిత, టీడీపీ నాయకులు



మడకశిరలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఈరన్న తదితరులు



హిందూపురంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకుల నివాళి

అన్నగారికి ఊరూవాడా
నివాళి

జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ వర్ధంతి

టీడీపీ వ్యవస్థాపకుడి విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళి
సేవా కార్యక్రమాలు చేపట్టిన తెలుగు తమ్ముళ్లు, అభిమానులు



హిందూపురం సద్భావన సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహం



పెనుకొండలో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న బీకే పార్థసారథి, నాయకులు



పుట్టపర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు గురువారం ఊరూ వాడా ఘన నివాళి అర్పించారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు టీడీపీ నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఎన్టీఆర్ ఔన్నత్యాన్ని కొనియాడారు.

● పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

● పెనుకొండలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

● హిందూపురంలోని పాత బస్టాండు వద్దగల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలువేసి, నివాళులు అర్పించారు.

● ఓబుళదేవరచెరువు మండలంలోని కొండకమర్ల గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

● ధర్మవరంలోని పాండురంగ సర్కిల్, కొత్తపేట రైల్వేస్టేషన్ ఎదుట గల ఎన్టీఆర్ విగ్రహాలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు.

● మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి, నివాళులు అర్పించారు.



ఓడీసీలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న పల్లె

ఒక పల్లె వ్యథ..!

అడుగు ముందుకు పడని అభివృద్ధి పనులు

పునాదులకు నోచుకోని భవన నిర్మాణాలు
టీడీపీ హయాంలో నిర్మించిన పంచాయతీ ఆఫీసే దిక్కు



పునాదులకే పరిమితమైన సచివాలయ భవన నిర్మాణం



చెట్లు, ఏపుగా పెరిగిన గడ్డి మధ్యలో కనిపిస్తున్న పిల్లర్ కడ్డీలు ఆర్బీకే భవనానివే. వైసీపీ పాలనలో చేపట్టిన నిర్మాణమిది. బిల్లులు అందక కాంట్రాక్టర్లు పనులను పునాదులు కూడా పూర్తి చేయకుండానే ఆపేశారు. ఏళ్లుగా అతీగతీ లేదు. అక్కడ గడ్డి పెరిగింది.. చెట్లు కూడా పెరిగి పెద్దవవుతున్నాయి కానీ, ఆర్బీకే పునాదులు, గోడలు మాత్రం లేవట్లేదు.

● భవనమే లేదు.. సేవలెక్కడ?

బొంతపల్లిలో ఆర్బీకే భవనం పునాదులకు కూడా నోచుకోలేదు. ఆర్బీకే ద్వారా రైతులకు అన్నిరకాల సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. ఏ సేవలు అందిస్తున్నారో చెప్పాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులు పండించిన పంటలను కొనుగోలు చేసిన పాపానపోలేదు. సబ్సిడీపై ఎరువులు కూడా ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తోంది. అలాంటి పరిస్థితే బొంతపల్లిలో కనిపించట్లేదు.




ఇవేవో పిల్లలు కట్టుకున్న బొమ్మరిళ్లు అనుకుంటే పొరబాటే. వినడానికి విడ్డూరంగా ఉన్నా.. ఇది వైసీపీ పాలకులు నిర్మించామని చెప్పుకుంటున్న హెల్త్ సెంటరే. తనకల్లు మండలం బొంతపల్లిలో దుస్థితి ఇది. పెద్దబండపై హెల్త్ సెంటర్ పనులను ఆర్భాటంగా ప్రారంభించారు. బిల్లులు అందక కాంట్రాక్టర్లు అలాగే వదిలేశారు. పునాదులు కూడా పూర్తి చేయలేదు. ఏళ్లుగా ఇదే దుస్థితి. పనులు పూర్తిగా అటకెక్కాయి.

వైసీపీ పాలకులు చెబుతున్నదానికి.. క్షేత్రస్థాయిలో వాస్తవాలకు పొంతనే లేదు. పల్లెల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామనీ, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లు, హెల్త్ సెంటర్లు నిర్మించామని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో అవన్నీ వట్టి మాటలేననడానికి మండలంలోని బొంతపల్లిలో పునాదులకు కూడా నోచుకోని భవన నిర్మాణాలే నిదర్శనం. బొంతపల్లిని 'ఆంధ్రజ్యోతి' గురువారం సందర్శించింది. గ్రామంలో సచివాలయ భవన నిర్మాణం పునాదులకే పరిమితమైంది. రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ పునాదులకు కూడా నోచుకోలేదు. ప్రభుత్వం చెబుతున్నట్లు గ్రామంలో అభివృద్ధి పనులు ఎక్కడని ఊరి జనం నిలదీస్తున్నారు. గ్రామాల్లో కనీసం మూరెడు సిమెంటు రోడ్డు వేసిన పాపాన పోలేదని మండిపడుతున్నారు. మురుగునీటి కాలువలను పట్టించుకునే నాథుడే లేడన్నారు. నిధుల విడుదలలో జాప్యం కారణంగా భవన నిర్మాణాలు పునాదులకు కూడా నోచుకోలేదు. టీడీపీ హయాంలో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే నేటికీ సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. అన్ని శాఖల సిబ్బంది ఆ చిన్న గదిలో విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

- తనకల్లు

● పంచాయతీ ఆఫీసులోనే అన్నీ..

గ్రామ సచివాలయం, హెల్త్‌సెంటర్, ఆర్బీకే భవనాలు ముందుకు కదలకపోవడంతో టీడీపీ హయాంలో నిర్మించిన పంచాయతీ భవనలమే దిక్కయింది. చిన్న గదిలో అన్ని శాఖల ఉద్యోగులు పనిచేయాల్సి వస్తోంది. వారు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. వివిధ పనుల నిమిత్తం సచివాలయనికి వచ్చే ప్రజలు నిలబడడానికి కూడా చోటులేక ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు కూడా లేక మహిళా సిబ్బంది పడుతున్న వేదన అంతా ఇంతాకాదు. సిబ్బందికే కూర్చోవడానికి చోటుండదనీ, ప్రజల బాధలు వినేవారెవరన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నామంటూ ప్రగల్భాలు పలికిన వైసీపీ నాయకులు కనీసం గ్రామాల్లో మంజూరు చేసిన ఇళ్లకు కూడా బిల్లులు చెల్లించలేదన్న అపవాదు ఉంది. జగనన్న కాలనీల పరిస్థితి చెప్పాల్సిన అవసరం లేదు. కాలనీలో మౌలిక వసతుల కల్పనలో అధికారులు విఫలమయ్యారన్నది నిర్వివాదాంశం.



బోరు మరమ్మతులకూ కటకటే..

గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. గ్రామ పంచాయతీలు నిధులలేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్రం ఇచ్చిన నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం మళ్లిస్తుండడంతో పంచాయతీ ఖాతాల్లో చిల్లిగవ్వ కూడా లేదు. రోడ్ల ఊసేలేదు. కనీసం తాగునీటి మోటార్లకు మరమ్మతులు చేయించలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇదేనా అభివృద్ధి అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి, ఊరును మార్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

బిల్లులు ఆలస్యమవడంతోనే..

బొంతపల్లిలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ నిర్మాణాలు ఆగిపోవడానికి బిల్లులు ఆలస్యం కావడమే కారణం. కాంట్రాక్టర్లు గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన సిమెంటును ఇతర పనులకు వాడుకోవడం, రికవరీలో సంబంధిత ఇంజనీర్లు చొరవ చూపకపోవడం కారణంగా నిర్మాణాలు ఆగిపోయాయి. త్వరలోనే సిమెంటు రికవరీ చేయించి, పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతాం.

- పూల నరసింహులు, ఎంపీడీఓ, తనకల్లు

ఎమ్మెల్యే ఫొటోపై
జగన్ స్టిక్కర్

పెనుకొండ వైసీపీలో అంతర్గత కుమ్ములాట
సచివాలయ భవన ప్రారంభోత్సవంలో బహిర్గతం
శిలాఫలకంపై ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఫొటో ఉండకూడదు..
నూతన ఇన్‌చార్జి, మంత్రి ఉషశ్రీ హుకుం?



శిలాఫలకంపై మొదట శంకర్‌నారాయణ ఫొటో

హిందూపురం, జనవరి 18: పెనుకొండ నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జి మార్పుతో విభేదాలు తలెత్తుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నారాయణ, నూతన ఇన్‌చార్జి, మంత్రి ఉష శ్రీచరణ్ మధ్య అంతర్గత కుమ్ములాటలు తాజాగా బయట పడ్డాయి. సోమందేపల్లి మండలం తుంగోడు గ్రామ సచివాలయాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. ఆ శిలాఫలకంపై ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఫొటోను ముద్రించారు. మంత్రి ఆదేశాలతో ఆ ఫొటోమీద జగనన్న స్టిక్కర్‌ను అధికారులు అతికించారు. స్థానిక ఎమ్మెల్యే అయినా.. మంత్రి ఆదేశాలను అధికారులు పాటించక తప్పలేదని సమాచారం. పెనుకొండలో ఎమ్మెల్యే శంకర్‌నారాయణను అధికార పార్టీలోకి కీలక సామాజికవర్గ నేతలు (రెడ్డి) ముందు నుంచీ వ్యతిరేకిస్తున్నారు. సర్వేలో సైతం ఆయనకు పరిస్థితి అనుకూలంగా లేదని వైసీపీ అధినాయకత్వం తేల్చింది. ఆయనను పెనుకొండ నుంచి తప్పించి, అనంతపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, మంత్రి ఉష శ్రీచరణ్‌ను పెనుకొండ ఇన్‌చార్జిగా నియమించింది. ఆమె నియామకాన్ని ఎమ్మెల్యే వర్గీయులు వ్యతిరేకిస్తున్నారు. పలువురు రాజీనామాలకు సైతం సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఐక్యంగా ఉన్నామని చెప్పేందుకు ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే, మంత్రి కలిసి పాల్గొన్నారు. అయినా.. లోలోన విభేదాలు బయట పడుతూనే ఉన్నాయి. తుంగోడు సచివాలయ భవన ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే శంకర్ నారాయణను ఆహ్వానించారు. ఆయన కూడా వస్తానని చెప్పినట్లు తెలిసింది. అయితే, ఎమ్మెల్యే వస్తే తాను రానని మంత్రి ఉష శ్రీచరణ్ అన్నట్లు తెలిసింది. శిలాఫలకంపై ఆయన ఫొటో కూడా ఉండకూడదని మంత్రి ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శిలాఫలకంపై ఉన్న ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఫొటో కనిపించకుండా, దానిపై జగనన్న స్టిక్కర్ వేశారు.



ప్రారంభించే సమయానికి శంకర్‌నారాయణ ఫొటో స్థానంలో జగన్ స్టిక్కర్

చంద్రబాబు సమక్షంలో చేరికలు



మడకశిరకు చెందిన వ్యాపారవేత్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

కదిరి/మడకశిర టౌన్, జనవరి 18: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో జిల్లాకు చెందిన పలువురు వైసీపీ నేతలు పసుపు కండువా కప్పుకున్నారు. కదిరికి చెందిన వైసీపీ నేత, వాల్మీకి పాఠశాల కరస్పాండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గరికపల్లి రామకృష్ణారెడ్డి.. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం వారికి చంద్రబాబు కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు ఇండిపెండెంట్ కౌన్సిలర్ మహమ్మద్ బాషా, వైసీపీ నాయకుడు, కార్పెంటర్ల సంఘం అధ్యక్షుడు ఇదాయత్ తదితరులు టీడీపీలో చేరారు.

మడకశిరకు చెందిన కాంగ్రెస్, వైసీపీకి చెందిన పలువురు పారిశ్రామిక వేత్తలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. రత్నగిరి బ్యాంకు యజమాని మాకం రమేష్‌బాబు, సర్వోదయ కళాశాల కరస్పాండెంట్ ఆదినారాయణ, వ్యాపారవేత్తలు సీఎస్ కృష్ణమూర్తి, వారి అనుచరులు పసుపు కండువా కప్పుకున్నారు.



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన కదిరికి చెందిన వాల్మీకి పవన్, చిత్రంలో కందికుంట


హోంగార్డు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్పీ

హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక సాయం

అనంతపురం క్రైం, జనవరి 18 : ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేస్తూ పలు కారణాలతో మృతి చెందిన 28మంది హోంగార్డుల కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ గురువారం ఆర్థిక సాయం అందించింది. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ చేతులమీదుగా ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున రూ.2.80లక్షల చెక్కులను అందజేశారు. ఇప్పటికే వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకం కింద హోం గార్డుల ఉద్యోగాలు ఇచ్చారు. ఏఆర్ అదనపు ఎస్పీ హనుమం తు, ఏఆర్ డీఎస్పీ మునిరాజా, ఆర్ఐ హరికృష్ణ, ఆర్ఎస్ఐ మగ్బూల్ బాషా పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఈఓ వైఖోమ్ నైదియా దేవి

అనంతపురం విద్య, జనవరి 18: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సీఈఓగా వైఖోమ్ నైదియా దేవి గురువారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఖాళీగా ఉన్న పోస్టుకు ఇటీవల ఐఏఎస్ అధికారి అయిన ఆమెను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అనంతపురం జిల్లా పరిస్థితులు, జడ్పీ పాలనా వ్యవహారాలను అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (డీఎల్‌డీఓ), ఎంపీడీఓలు, జడ్పీ అధికారులు, సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు కసరత్తు

- ఉపాధ్యాయులవైపే కమిషన్ మొగ్గు
- ఎన్ఐసీకి చేరిన టీచర్ల డేటా
- పీఓ, ఏపీఓల నియామకానికి ఏర్పాట్లు
- అంగన్‌వాడీల స్థానంలో సచివాలయ సిబ్బంది..



అనంతపురం టౌన్, జనవరి18: ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు ఓటర్ల ఫిర్యాదులు, పరిశీలన, పోలింగ్ కేంద్రాలు, వసతులపై అధికారులు కుస్తీ పట్టారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో అవసరమైన సిబ్బందిని నియమించి వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో సిబ్బంది నియామకానికి కసరత్తు మొదలైంది. ఈ సారి ఉపాధ్యాయులను దూరం పెట్టాలని సీఎంతో సహా పలువురు ఉన్నతాధికారులు విశ్వప్రయత్నాలు చేశారు. అయితే కేంద్ర ఎన్నికల కమిషన్ ఉపాధ్యాయులకు విధులు కేటాయించాల్సిందేనని ఆదేశాలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం ఉపాధ్యాయుల వివరాలను సేకరిస్తోంది. ప్రభుత్వ, మున్సిపల్, జిల్లాపరిషత్, మండల పరిషత్ పరిధిలో పనిచేస్తున్న అన్నికేడర్ల టీచర్ల వివరాలను పంపించాలని విద్యాశాఖాధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సేకరించిన జాబితాను గురువారం విద్యాశాఖ ఎన్ఐసీ సెంటర్‌కు పంపించారు. మొత్తం అన్నివిభాగాల్లో కలిపి 9,400 మంది ఉపాధ్యాయులు జాబితాలో ఉన్నారు. ఇప్పటికే అన్నిశాఖల అధికారులు, ఉద్యోగుల వివరాలను ఆయావిభాగాల ఉన్నతాధికారుల ద్వారా డేటాను ఎన్ఐసీ తెప్పించుకుంది. వారి కేడర్‌ను బట్టి ఎన్నికల విధులు అప్పగించనున్నారు. ప్రధానంగా అధికార కేడర్‌గల వారిని రూట్ ఆఫీసర్లు గా, పర్యవేక్షణాధికారులుగా నియమిస్తారు. అత్యంత కీలకమైన పీఓ, ఏపీఓలను ఉపాధ్యాయులనే నియమించనున్నారు. గతంలో ఏపీఓలుగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండేవారు. వారి స్థానంలో ఈసారి సచివాలయ ఉద్యోగులను నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిపక్ష టీడీపీ సచివాలయ ఉద్యోగులను ఎన్నికలకు నియమించకూడదని న్యాయస్థానంలో కేసువేసింది. న్యాయస్థానం తీర్పును బట్టి ఏపీఓల నియామకం ఉంటుందంటున్నారు. జిల్లాలో ఈసారి 2,213 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈకేంద్రాలకు దాదాపు 11 వేలమందివరకు సిబ్బందిని నియమించాల్సి ఉంటుందని అధికారవర్గాలు పేర్కొంటున్నారు. ఈమేరకు కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సెంటర్‌లో అధికారులు, సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. వారంలోపే ఈప్రక్రియ పూర్తి చేసి, శిక్షణ ఇవ్వనున్నారు. మొత్తానికి అధికారుల్లో ఎన్నికల అలజడి మొదలైందని చెప్పవచ్చు


కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సెంటర్

రీయింబర్స్‌మెంట్ సొమ్ము విడుదల

అనంతపురం టౌన్, జనవరి 18: జిల్లాలో 8,697మంది గృహ లబ్దిదారుల రుణాలకు వడ్డీ రీఎంబర్స్‌మెంట్ విడుదల చేసినట్లు కలెక్టర్ గౌతమి గురువారం వెల్లడించారు. నవరత్నాలు-అందరికీ ఇళ్లు పథకం కింద ఇళ్లు నిర్మించుకున్నవారికి రాష్ట్రవ్యాప్తంగా నిధులు విడుదల చేశారు. అందులో భాగంగా జిల్లాకలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా లబ్దిదారులకు సొమ్మును విడుదల చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 53,426 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ188కోట్లు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులోఅర్హులైన 8,697మందిసభ్యులకు రూ.85.58 లక్షల వడ్డీ మంజూరైందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సీ మంగమ్మ, డీఆర్‌డీఏపీడీ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

ఉరవకొండ, జనవరి18: సీఎం పర్యటన నేపథ్యంలో ఉరవకొండలో ఏర్పాట్లను కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ గురువారం పరిశీలించారు. పట్టణ శివారు అనంతపురం రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద ఉన్న స్థలాన్ని, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలోని ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 23న సీఎం ఉరవకొండకు రానున్నారని, వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో సీఎం పాల్గొంటారన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం రానున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు రెడ్డి, గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దారు శ్రీధర్ మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు

అనంతపురం విద్య, జనవరి 18 : ఉమ్మడి అనంతపురం జిల్లాలో నవోదయ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఏసీ గోవింద్ నాయక్ పేర్కొన్నారు. గురువారం ఉపాధ్యాయ భవన్‌లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ...20వ తేదీ ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకూ పరీక్షలు ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని, 34 కేంద్రాల పరిధిలో 8857 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు,సీఎస్‌లు, డీఓలు పాల్గొన్నారు.

పొలంలో ఘోరం

- విద్యుదాఘాతంతో తండ్రీకొడుకుల మృతి


తండ్రి, కొడుకు మృతదేహాలు


రైతు బయపరెడ్డి (ఫైల్)


రాజారెడ్డి (ఫైల్)

నార్పల, జనవరి 18: వేరుశనగ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన తండ్రీకొడుకులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డారు. ఈ విషాద ఘటన నార్పల మండల పరిధిలోని జంగంరెడ్డిపల్లిలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బయపరెడ్డి(42), ఆయన కుమారుడు రాజారెడ్డి(18) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బయపరెడ్డికి మూడున్నర ఎకరాల పొలం ఉంది. అందులో బోరుబావి కింద వేరుశనగ సాగు చేశాడు. పంటకు నీరు పెట్టేందుకు గురువారం తెల్లవారు జామున కుమారుడు రాజారెడ్డితో కలిసి బైక్‌పై వెళ్లాడు. మోటార్ ఆన్ చేసేందుకు స్టార్టర్ బాక్సును ముట్టుకోగానే బయపరెడ్డి తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. తండ్రిని కాపాడే క్రమంలో రాజారెడ్డి కూడా షాక్‌కు గురయ్యాడు. వారి అరుపులు విన్న పక్క పొలం రైతులు వెళ్లి చూసేసరికి ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. స్టార్టర్ బాక్సుకు విద్యుత్ తీగలు తగలడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు పొలానికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పండుగ సెలవులకు వచ్చి..

రైతు బయపరెడ్డికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు రాజారెడ్డి హైదరాబాదులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. కాలేజీకి గురువారం వెళ్లాల్సి ఉంది. తండ్రి పొలానికి వెళుతుండటంతో సరదాగా వెంట వెళ్లాడు. తండ్రిని కాపాడే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయాడు. తండ్రీకొడుకుల మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. రైతు భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు.


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సిట్టింగులకు షాక్



- శింగనమలకు వీరాంజనేయులు
- మడకశిరకు ఈర లక్కప్ప
- ఇన్‌చార్జిలను ప్రకటించిన వైసీపీ


ముఖ్యమంత్రితో వీరాంజనేయులు, సాంబ

అనంతపురం క్రైం/పుట్టపర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మరో ఇద్దరు సిట్టింగులకు వైసీపీ అధినాయకత్వం షాక్ ఇచ్చింది. శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి స్థానంలో వీరాంజనేయులును, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి స్థానంలో ఈర లక్కప్పను నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా నియమించింది. వచ్చే ఎన్నికల్లో వీరే ఎమ్మెల్యే అభ్యర్థులన్నది సుస్పష్టం. శింగనమల అభ్యర్థి పేరు ప్రకటించగానే.. 'ఎవరబ్బా.?' అని జనమే కాదు.. అధికార పార్టీ శ్రేణులు కూడా చర్చించుకునే పరిస్థితి. సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డికి అనుచరుడు వీరాంజనేయులు. ఏపీ నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల భర్త. సాంబశివారెడ్డి ఏం చెబితే అది వీరు చేస్తారన్న ప్రచారం ఉంది. వీరాంజనేయులు స్వగ్రామం శింగనమల మండలం బండమీదపల్లి. ఆయన తండ్రి వెంకటప్ప చక్రాయపేట పంచాయతీకి మాజీ సర్పంచ్. వీరాంజనేయులు కొర్రపాడు ఇసుక రీచ్‌కు ఏపీఎండీసీ మేనేజర్‌గా పనిచేసేవారు. ఈ ఇసుక రీచ్‌లన్నీ సాంబ పరిధిలోనే ఉన్నాయి.

ఎవరీ ఈర లక్కప్ప?

వైసీపీలో సాధారణ నాయకుడు ఈర లక్కప్ప. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామిని పది రోజుల క్రితం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాయాలనికి పిలిపించుకున్నారు. టిక్కెట్ లేదని చెప్పి పంపించారు. కొత్త అభ్యర్థికి సహకరించాలని ఆదేశించారు. చిత్తూరు జిల్లాకు చెందిన సీఐ శుభకుమార్‌ను బరిలో దింపుతారని ప్రచారం జరిగింది. అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ తరఫున 2003-2008 మధ్య గుడిబండ సర్పంచ్‌గా ఎన్నికైన ఈర లక్కప్పకు అవకాశం ఇచ్చారు. వైసీపీలోనే ఉన్నా, పెద్దగా గుర్తింపు లేని ఈర లక్కప్పను తెరపైకి తీసుకువచ్చారు. ఆయన ఎంపికపై ఎమ్మెల్యే వర్గీయులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే వ్యతిరేక వర్గీయులు మాత్రం సంబరాలు చేసుకుంటున్నారు.


లక్కప్ప

శింగనమల నుంచి ఈసారి అవకాశం లేదని మొదట్లోనే పద్మావతికి సీఎం జగన్ చెప్పేశారు. మాదిగ సామాజికవర్గానికి సంబంధించిన వ్యక్తిని ఎంచుకోమని ఆమెకే సూచించారనే ప్రచారం జరిగింది. ఈ క్రమంలో సాంబశివారెడ్డి అనుచరుడు వీరాంజనేయులును ప్రతిపాదించారని సమాచారం. ఎమ్మెల్యే అభ్యర్థిగా తొలుత డీఎస్పీ శ్రీనివాసమూర్తి పేరు వినిపించింది. మాజీ ఎమ్మెల్యే యామినీబాల, ఆమె సోదరుడు అశోక్ పేరు కూడా తెరపైకి వచ్చాయి. ఈ పేర్లను సైతం సాంబశివారెడ్డి ప్రతిపాదించారు. ఈ ఇద్దరి పేర్లను పార్టీ తిరస్కరించింది. సంక్రాంతికి ముందు నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ ప్రమీల పేరును తీసుకొచ్చారు. అప్పటికప్పుడు ఆమెను విజయవాడకు ఓ వాహనంలో తీసుకెళ్లారు. ఆమె వయసు తక్కువగా ఉందని తిరస్కరించారట. ఎటూ పాలుపోక ప్రమీల భర్త వీరాంజనేయులును సీఎం దగ్గరికి తీసుకెళ్లి పుష్పగుచ్ఛం అందజేయించారు. అలా సమన్వయకర్తగా నియమించారు.

చేనేత ఆత్మహత్యలను నివారిస్తా

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్


విలేకరులతో మాట్లాడుతున్న పరిటాలశ్రీరామ్

ధర్మవరం, జనవరి 18: ధర్మవరం పట్టణంలో చేనేతల ఆత్మహత్యలను పూర్తిగా నివారిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఇటీవల పట్టణంలో ఐదు రోజులపాటు నిర్వహించిన పాదయాత్రలో ప్రజలు తన దృష్టికి అనేక సమస్యలను తీసుకొచ్చారన్నారు. ఇందులో ప్రధానమైనది చేనేత పరిశ్రమ అని తెలిపారు. అందుకే నా మొదటి ప్రాధాన్యం హ్యాండ్‌లూమ్‌ను కాపాడడమేనని చెప్పారు. చేనేత మగ్గాలు నేసిన వారికి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని, వీలైతే అద్దెలు కూడా ప్రభుత్వమే భరించేలా చూస్తామని తెలిపారు. నేత కార్మికులు నేసిన చీరలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని, రాయితీలు పునరుద్ధరిస్తామని, వారికి ప్రత్యేక గుర్తింపుకార్డులు ఇచ్చి ఎలాంటి నిబంధనలు లేకుండా అన్ని రకాల పథకాలు వర్తింపచేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మరీ ముఖ్యంగా నారాలోకేశ్ చేనేత రంగాన్ని దత్తత తీసుకుంటానని ప్రకటించారని, చేనేతలకు ఎలాంటికష్టనష్టాలు లేకుండా హ్యాండ్‌లూమ్ వ్యవస్థను కాపాడుతారని పేర్కొన్నారు. మరోవైపు ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కుటుంబాలను, వారి పిల్లలను ఆదుకునేందుకు ప్రత్యేక కమిటీ వేస్తామన్నారు. అదేవిధంగా ధర్మవరంలో వేలాది మంది మహిళలు ఉపాధి లేకుండా దుర్భర జీవితం గడుపుతున్నారని, వారికోసం టీడీపీ అధికారంలోకి రాగానే స్టిచ్చింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ఇళ్లు, ఇళ్లస్థలాలు, పింఛన్, రేషన్‌కార్డులు లేని వారికి అవన్నీ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీరు, విద్యుత్, శ్మశాన వాటికలు, రోడ్లు, డ్రైనేజీలు లేనిచోట వాటి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. వీటిపై నాలుగున్నర ఏళ్లగా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోలేదన్నారు. ధర్మవరంలో వ్యాపారాలు చేసుకునే వారికి టీడీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు టికెట్ విషయంలో పుకార్లు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కచ్చితంగా ధర్మవరంలో టీడీపీజెండా ఎగురవేసేది తానేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు కమతంకాటమయ్య, ఫణికుమార్, పరిశేసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై అణచివేత తగదు : ఏపీటీఎఫ్


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు

అనంతపురం విద్య, జనవరి 18: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలపై ప్రభుత్వం అణచివేత ధోరణి సరికాదని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. గురువారం ఉపాధ్యాయభవన్‌లో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు 2023 జులై నుంచి అమలు చేయాల్సిన 12వ పీఆర్సీ ఇంత వరకూ అమలు చేయలేదన్నారు. వెంటనే 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించి సత్వరమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగేళ్లుగా 11వ పీఆర్సీ బకాయిలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. డీఏ బకాయిలు, సరెండ్ లీవ్స్, పీఎఫ్ రుణాలు తక్షణమే చెల్లించాలన్నారు. అదేవిధంగా జీవో 117 రద్దు చేయాలని, వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, లేనిపక్షంలో 31న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఇతర నాయకులు సతీష్ కుమార్, సర్ధార్ వలి, వన్నప్ప, లక్ష్మినారాయణ, రామ్మోమన్, రంగనాయకులు, వేణుగోపాల్, శాంసన్, ఓబులేసు, నస్తుల్లాహ్ పాల్గొన్నారు.

బేషరతుగా కేసులు ఎత్తివేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

ఉరవకొండ, జనవరి18: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులపై నమోదైన కేసులను బేషరతుగా ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా చూస్తోందని, కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. జీతాలు ఇవ్వకపోతే ఎలా పనిచేస్తారని, జీతాలు అడిగినందుకు కార్మికులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం తగదన్నారు. ఎంపీ తలారి రంగయ్య ఆదేశాల మేరకే డీఈ, సర్పంచు భర్త మోటార్లు ఆన్ చేశారని, దీంతోనే పైపులు పగిలి పోయాయన్నారు. వారిపై కేసులు నమోదు చేయకుండా కార్మికులపై కేసులు పెట్టడం తగదన్నారు. సమ్మెలో ఉన్న కార్మికులపై కేసులు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. అక్రమ కేసులు ఎత్తి వేయాలని, లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు మధుసూదన్, రంగారెడ్డి, శ్రీనప్ప పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

మహిళ హత్య


లక్ష్మీదేవి (ఫైల్)

ముదిగుబ్బ, జనవరి18: మండలంలోని దొరిగల్లు అటవీ ప్రాంతంలో అనంతపురంలోని రామ్‌నగర్‌కు చెందిన లక్ష్మీదేవి(53)ని ఈనెల 16న హత్య చేశారు. విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముదిగుబ్బ సీఐ యతీంద్ర తెలిపిన వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన లక్ష్మీదేవి భర్త వెంకటేశ్వరబాబు 6 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి లక్ష్మీదేవి చిట్టీలు నడుపుకుంటూ జీవనం సాగించేది. అనంతపురానికి చెందిన ఆదినారాయణతో పరిచయం ఏర్పడడంతో రూ.5లక్షలు అప్పు తీసుకుంది. ఆ తర్వాత వారి పరిచయం వివాహేతర బంధానికి దారి తీసింది. తరచూ దొరిగల్లు అటవీ ప్రాంతానికి వచ్చేవారు. అనంతపురానికి చెందిన మరో వ్యక్తి విశ్వనాథ్‌తో ఆమె సన్నిహితంగా మెలగడంతో ఆదినారాయణ తాను ఇచ్చిన రూ.5 లక్షలు తిరిగివ్వాలని డిమాండ్ చేశాడు. లక్ష్మీదేవి, విశ్వనాథ్ కలిసి ఆదినారాయణను బెదిరించారు. లక్ష్మీదేవిని హత్య చేయాలని నిర్ణయించుకున్న ఆదినారాయణ ఆమెకు మాయ మాటలు చెప్పి, మంగళవారం తరచూ వచ్చే దొరిగల్లు అటవీ ప్రాంతానికి, ద్విచక్ర వాహనంలోనే తీసుకువచ్చారు. అక్కడ ఆమెను చీరతోనే మెడకు బిగించి హత్య చేసి అక్కడ నుంచి పరారయ్యారు. లక్ష్మీదేవి ఇంట్లో కనిపించలేదని, ఆమె రెండవ కుమార్తె నందిని అనుమానంతో ఆదినారాయణకు ఫోన్ చేసింది. మీ అమ్మ డబ్బులు ఇవ్వకుండా, బెదిరిస్తుండడంతో దొరిగల్లు అటవీ ప్రాంతంలో హత్య చేశానని పేర్కొన్నారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు అనంతపురం నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతపురం పోలీసులు ముదిగుబ్బ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. మృతురాలిని గుర్తించి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, నిందితు ని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

టీడీపీతోనే రైతులకు న్యాయం

అధికారంలోకి రాగానే పట్టు రైతుకు ప్రోత్సాహకం: అంబికా లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

హిందూపురం అర్బన్, నవంబరు 18: టీడీపీతోనే రైతులకు సంపూర్ణ న్యాయం సాధ్యమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో రైతులకు ప్రోత్సాహకం అందేలా చూస్తామని టీడీ పీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. గురువారం స్థానిక పట్టుగూళ్ల మార్కెట్ ఎదురుగా రైతులు, పట్టు రీలర్లు చేపట్టిన సమ్మెకు ఆయన సంఘీభావం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈనెల 20న హిందూపురం రానున్నారని, రైతుల సమ్మెకు ఆయన మద్దతు ఇస్తారన్నారు. రైతులు చేస్తున్న పోరాటం వందశాతం ఆమోదయోగ్యమైనదని అందుకు టీడీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. గత ఎన్నికల ముందు రైతులకు ప్రోత్సాహకం ఇస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్ రైతులను నిలువునా ముంచారన్నారు. 2019 నుంచి రైతులకు రావాల్సిన ప్రోత్సాహక బకాయిలు రూ.67 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లకుంట అంజినప్ప, లాయర్ శివకుమార్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి సిద్దారెడ్డి, మడకశిర సోమశేఖర్, పరిగి రాజేష్, నవీన్, జయరాంరెడ్డి, శంకర్, హనుమంతరెడ్డి, ఓపీడీఆర్ శ్రీనివాసులు, అదే విధంగా రైతులకు బిజెపి పార్టీ రాష్ట్ర నాయకుడు రమేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అమానుల్లా, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భిక్షాటన

పట్టణంలో పట్టురైతులు శుక్రవారం భిక్షాటన చేపట్టనున్నట్లు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి ఆయన పిలుపునిచ్చారు.

కొనసాగిన సమ్మె

ధర్మవరం: ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేస్తూ గురువారం స్థానిక సెరికల్చర్ కార్యాలయం వద్ద పట్టు రైతులు, రీలర్లు సమ్మె చేపట్టారు. సమ్మెకు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రైతులు సమ్మె శిబిరంలో మోకాళ్లపై నిలబడి నిరసన చేశా రు. అనంతరం జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ.. 2017 నుంచి ఇన్సెంటివ్ రావాల్సి ఉంటే గతంలో చేసిన ఆందోళనకు కొద్దిగా విడుదల చేశారన్నారు. 2019 నుంచి ఇప్పటివరకు ధర్మవరం పట్టుగూళ్ల మార్కెట్‌కు సంబంధించి రూ.10కోట్లు బకాయిలు రావాల్సి ఉందన్నారు. మూడేళ్ల గడుస్తున్నా మూడు రూపాయలు కూడా ప్రోత్సాహకం విడుదల చేయలేదని మండిపడ్డారు.


మోకాళ్లపై నిలబడి పట్టు రైతులు, రీలర్ల నిరసన

గొర్రెల మందపై దూసుకెళ్లిన బొలెరో.. 28 జీవాల మృతి


మృతి చెందిన గొర్రెలు


ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనం

కళ్యాణదుర్గం, జనవరి 18: గొర్రెల మందపై బొలెరో వాహనం దూసుకెళ్లడంతో 28 జీవాలు మృత్యువాత పడ్డాయి. మండలంలోని గూబనపల్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో 28 గొర్రెలు మృతి చెందగా మరో 30 తీవ్రంగా గాయపడ్డాయి. కంబదూరు మండలం కర్తనపర్తి గ్రామానికి చెందిన మారెప్ప తన 500 గొర్రెలను మేత కోసం కర్ణాటకలోని బళ్లారి ప్రాంతానికి తరలిస్తున్నాడు. తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో గూబనపల్లి సమీపంలో ప్రధాన రహదారిపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం మందపైకి దూసుకెళ్లింది. దీంతో గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో 30 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ రోడ్డు పక్కన వాహనాన్ని వదిలి పరారయ్యాడు. సుమారు రూ. ఆరు లక్షల వరకు నష్టం జరిగినట్లు గొర్రెల కాపరి మాధవయ్య తెలిపారు. గొర్రెల యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు ఉద్యోగ సమస్యలపై స్పందన

అనంతపురం టౌన్, జనవరి18: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సాయంత్రం 4గంటలకు జరిపే స్పందనలో ఉద్యోగులు తమ సమస్యలను తెలిపి పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.


ధర్మవరంలోని ఎన్టీఆర్ క్యాంటీన్ వద్ద అన్నదానం చేస్తున్న పరిటాల శ్రీరామ్


ధర్మవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గోనుగుంట్ల వర్గీయులు


కదిరి మున్సిపల్‌కార్యాలయం సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ శ్రేణుల నివాళి


ముదిగుబ్బలో..


నల్లమాడలో..


కొత్తచెరువులో..

చిరస్మరణీయుడు ఎన్టీఆర్

● కొనయాడిన టీడీపీ శ్రేణులు, అభిమానులు

● వర్ధంతి సందర్భంగా వాడవాడలా ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్:

చిరస్మరణీయుడు ఎన్టీఆర్ అని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కొనియాడారు. టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని గురువారం వారు నిర్వహించారు. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లోని పట్టణాలు, మండలకేంద్రాలతో పాటు పల్లెల్లో సైతం ఎన్టీఆర్ వర్ధంతిని జరిపారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించి బీసీలకు , వెనుకబడిన వర్గాల వారికి పెద్దపీట వేశారని తెలిపారు. అదేవిదంగా ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎనలేని సేవలు చేసి చిరస్మరణీయుడిగా నిలిచారని తెలిపారు. అలాగే తెలుగు కీర్తిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. పలు చోట్ల టీడీపీ శ్రేణులు ఆస్పత్రుల్లో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

ఇంకొన్ని చోట్ల పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ధర్మవరం పట్టణంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ స్థానిక పాండురంగసర్కిల్‌లో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొత్తపేట రైల్వేస్టేషన్ ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తెలుగు రాష్ట్రాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఆయన ప్రతిఒక్కరికీ స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. తర్వాత ఎన్టీఆర్ క్యాంటీన్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఎన్‌బీకే అభిమానులు ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


బత్తలపల్లిలోని విగ్రహం వద్ద నివాళి


బుక్కపట్నంలో..


తనకల్లులో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద టీడీపీ శ్రేణుల నివాళులు


తాడిమర్రిలో ..


అమడగూరులో..


పుట్టపర్తి మండలం పెడపల్లిలో..

బీసీల ద్రోహి సీఎం జగన్: మాజీ మంత్రి పల్లె


బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న పల్లె రఘునాథరెడ్డి

ఓబుళదేవరచెరువు, జనవరి 18: సీఎం జగన్ రెడ్డి బీసీల ద్రోహి అని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. జయహో బీసీ కార్యక్రమం సందర్భంగా మొదట కొండకమర్లలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్‌ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ కొండకమర్లనుంచి కుసుమవారిపల్లి, ఓడీచెరువు, వెంకటాపురం, టి.కుంట్లపల్లి మీదుగా సాగింది. అ నంతరం మండలకేంద్రంలోని వెంకటసాయి ఐటీఐలో జయహో బీసీ సమావేశం జరిగింది. ఇందులో పల్లె మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా పైకి తెచ్చిన ఘనత ఎన్టీఆర్, చంద్రబాబుదేనని తెలిపారు. బీసీ కులాలకు జగన్‌రెడ్డి వెన్నుపోటు పొడిచారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 25 ఏళ్లుగా 34శాతం బీసీలకున్న రిజర్వేషన్లను జగన్ అధికారంలోకి వచ్చాక 10శాతం కోత విధించారని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీ నాయకులపై దాడులు సైతం జరిగాయన్నారు. అన్నికులాలు, వర్గాలకు సమ న్యాయం చేసిన ఘనత టీడీపీకి దక్కుతుందన్నారు. జిల్లా నాయకులు అంబికాలక్ష్మీనారాయణ, సామకోటి ఆదినారాయణ, వాల్మీకి సాధికార జిల్లా అధ్యక్షుడు బోయ రామాంజనేయులు, జనసేన జిల్లా నాయకులు అబ్దుల్ మాట్లాడుతూ జగన్ రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, నాయకులు సుధాకర్, మహబూబ్‌బాషా, షబ్బీర్, చాంద్‌బాషా, ఆర్ఫీఖాన్, షానూ, ఐటీడీపీ షావ్వాజ్, కంచి సురేష్, రామాంజనేయులు, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, మస్తానమ్మ, అఖిల, భాగ్యమ్మ, ఆర్‌ఎంపీ జాకీర్, రాజారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల స్పందన

పుట్టపర్తి, జనవరి 18: స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రభుత్వోద్యోగుల సమస్యలపై అర్జీల స్వీకరణ కార్యక్రమం స్పందన నిర్వహించనున్నట్లు డీఆర్వో కొండయ్య ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యోగులు తమ సర్వీసు, సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

టీడీపీతోనే బడుగుల అభ్యున్నతి

అమడగూరు, జనవరి 18: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని రాష్ట్ర వడ్డెర సాధికర సమితి కన్వీనర్ వడ్డె వెంకట్ పేర్కొన్నారు. మండలంలోని మహమ్మదాబాద్‌లో గురువారం ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1982కు ముందు రాష్ట్రంలో అగ్రవర్ణాల వారి పెత్తనం సాగేదని, నాడు ఎన్టీఆర్ టీడీపీని స్థాపించి బడుగులకు రాజకీయ జీవితం ఇచ్చారని గుర్తు చేశారు. గతంలోనే 24శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పించారన్నారు. అయితే వైసీపీ పాలనలో 63శాతం రిజర్వేషన్ ఉన్నా.. బీసీలకుఎలాంటి న్యాయం జరగలేదన్నారు. బీసీలపై అక్ర మకేసులు పెట్టి జైలుకు పంపిన ఘనత సీఎంజగన్ కే దక్కుతుందన్నారు. 2024లో టీడీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పల్లపు రవీంద్ర, నాయకులు లక్ష్మీనారాయణ, చంద్ర, టైలర్ జయరాం, నాగరాజు, రమణప్ప పాల్గొన్నారు.

కదిరిలో మెగా రక్తదాన శిబిరం


రక్తదానశిబిరాన్ని ప్రారంభిస్తున్న కందికుంట యశోదమ్మ

కదిరి, జనవరి 18: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్య మందిరంలో గురువారం మెగా రక్తదాన శిబిరాన్ని టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి యశోదమ్మ ఆ శిబిరాన్ని ప్రారంభించారు. కదిరి నియోజకవర్గంలోని పలు మండలాలనుంచి నాయకులు, కార్యకర్తలు విచ్చేసి రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ట్రస్టుతోపాటు స్థానికంగా ఉన్న బ్లడ్‌బ్యాంక్ నిర్వాహకులు రక్తాన్ని సేకరించారు. సుమారు 331మంది రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ పెనుకొండ నాయకురాలు సవితమ్మ హాజరై ఎన్టీఆర్ రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు.

అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

● ఎస్పీకి మాజీమంత్రి పల్లె ఫిర్యాదు

పుట్టపర్తిరూరల్, జనవరి 18: సోషల్‌మీడియాలో తనపై అసత్యప్రచారాలు చేస్తూ తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి ఎస్పీ మాధవరెడ్డిని కోరారు. ఈమేరకు గురువారం ఆయన స్థానిక జిల్లాపోలీసుకార్యాలయంలో ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. తన గురించి సోషల్ మీడియాలో వైసీపీకి చెందిన కొంతమంది నాయకులు అసత్య ప్రచారం చేస్తూ తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

38వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె


ఓడీసీలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు

ధర్మవరం, జనవరి 18: సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 38వ రోజూ కొనసాగింది. పట్టణంలోని అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె శిబిరంలో సీఎం జగన్‌కు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. సీఎం సారూ నీకు కోటిదండాలయ్యా..మా సమస్యలను తక్షణమే పరిష్కరించవయ్యా అంటూ నిరసన చేపట్టారు. వారికి సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎల్ ఆదినారాయణ మద్దతు తెలిపారు.

కదిరిఅర్బన్: పట్టణంలోని అంగన్‌వాడీలు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం షోకాజ్ నోటీసులకు వివరణ ఇస్తూ.. సీడీపీఓకు అందించారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: తమకు ప్రభుత్వం ఇచ్చిన ఎస్మా చట్టాన్ని అంగన్‌వాడీ వర్కర్లు వ్యతిరేకిస్తూ.. అందుకు సంబంధించిన సమాధానాన్ని రాతపూర్వకంగా సీడీపీఓ వరలక్ష్మికి అందజేశారు. అహ్మదాబాద్ క్రాస్‌లోని సీడీపీఓ కార్యాలయం ఎదురుగా సమ్మె చేశారు. వీరికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు సంఘీబావం తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి గడ్డుకాలమేనన్నారు. వెంటనే చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయ సమీపంలోనే హత్యాయత్నం

ప్రాణహాని ఉందని పోలీసులకు

గతంలోనే బాధితుడి ఫిర్యాదు

పట్టించుకోని పోలీసులు


రాజశేఖర్‌రెడ్డి

పుట్టపర్తిరూరల్, జనవరి 18: జిల్లా ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో జిల్లా స్థాయి అధికారిపై జరిగిన హత్యాయత్నం ఘటన జిల్లాకేంద్రంలో అలజడి రేపింది. భూగర్భజలశాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి బుధవారం రాత్రి 10:30 గంటల సమయంలో బయటి నుంచి ఇంట్లోకి వెళుతుండగా.. అప్పటికే అక్కడ కాపుకాచిన దుండగులు కంట్లో కారం చల్లి మారణాయుధాలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రాజశేఖర్‌రెడ్డి ఇంటిమెట్ల ముందరే పడిపోవడంతో దుండగులు పారిపోయారు. తర్వాత కొద్దిసేపటికి తేరుకున్న రాజశేఖర్‌రెడ్డి తనమిత్రులకు, అర్బన్‌పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ సీఐ కొండారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని అతన్ని సత్యసాయి జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆ అధికారిపై గ తంలో కూడా ఒకసారి దాడి జరగ్గా.. తనకు ప్రాణహాని ఉందని ఆయన గత డిసెంబరులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుటుంబ సభ్యులు, తన శాఖలోని కొందరు ఉన్నతాధికారులు కలిసి తనను హతమార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అయినా ఆ దిశగా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ అధికారిపై మరోసారి దాడి జరిగింది. గురువారం పట్టణ సీఐ కొండారెడ్డి మాట్లాడుతూ ఘటనపై రాజశేఖర్‌రెడ్డి నుంచి ఫిర్యాదు తీసుకున్నామన్నారు. ఆమేరకు దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రాజశేఖర్‌రెడ్డి ఇంటి వద్ద సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి, దాడివెనుక ఎవరున్నారో త్వరలోనే పట్టుకుంటామన్నారు. దీని వెనుక ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదని అన్నారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి..

భూగర్భజల శాఖ అధికారిపై దాడిచేసిన దుండగులను త్వరగా పట్టుకోవాలని దివ్యాంగుల హక్కుల పోరాటసమితి నాయకులు ఏఎస్పీ విష్ణుకు విన్నవించారు. విభిన్నప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు షఫీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు ఏఎస్పీకి వినతి అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుడైన అధికారిపై హత్యాయత్నం జరగడం అమానుషమన్నారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

టీడీపీలోకి భారీగా చేరికలు


పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు


వైసీపీ శ్రేణులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి పల్లె


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ సర్పంచ్ కుమారుడు సిద్ధారెడ్డి

ధర్మవరం, జనవరి 18: తెలుగుదేశంపార్టీలో చేరేందుకు వైసీపీ నుంచి క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో గురువారం ధర్మవరం పట్టణంలో వైసీపీకి చెందిన సుమారు 50 కుటుంబాల వారు పరిటాలశ్రీరామ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తామన్నారు. అందరూ టీడీపీ విజయానికి సైనికుల్లా కృషి చేయాలని సూచించారు.

వైసీపీనుంచి 50కుటుంబాలు చేరిక

పుట్టపర్తి: కొత్తచెరువు మండలం మైలసముద్రం గ్రామానికి చెందిన 50కుటుంబాల వైసీపీ శ్రేణులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో లక్ష్మీదేవి, నారాయణ, మోహన్, నరసింహులు, రమణమ్మ, పెద్దన్న, లక్షమ్మ, రమాదేవి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కిలారి శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

గాండ్లపెంట: బీజేపీ మండల మండలాధ్యక్షుడు దొనకొండ ఆనంద్, తూపల్లి వైసీపీ సర్పంచ్ కుమారుడు సిద్ధారెడ్డి గురువారం చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో చేరారు. టీడీపీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

పరిటాల, గోనుగుంట్ల వర్గీయుల వాగ్వాదం

ధర్మవరం, జనవరి 18: ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల విషయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల వర్గీయుల మధ్య మాటలయుద్ధం జరిగింది. పాండురంగ సర్కిల్లోని ఎన్టీఆర్ విగ్రహాన్ని పరిటాల వర్గీయులు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పరిటాల శ్రీరామ్ చేతులమీదుగా గురువారం ఉదయం 10గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించడానికి సిద్ధం చేశారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల వర్గీయులు 9:30గంటలకు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడానికి వచ్చారు. దీంతో అక్కడే ఉన్న పరిటాల వర్గీయులు శ్రీరామ్ వచ్చి వెళ్లే వరకు వేచిఉండాలని అడ్డుకున్నారు. తాము ఎన్టీఆర్ విగ్రహాన్ని శుభ్రం చేసి పూలతో అలంకరించామని పేర్కొన్నారు. పరిటాలశ్రీరామ్ వచ్చి వెళ్లిన తరువాత మీరు పూలమాల వేసుకోవాలని సూచించారు. దీంతో ఇరువురి మధ్య మాటల యుద్ధం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పాలని చూసినా వారి మధ్య వాగ్వాదం ఆగలేదు. ఇలా గంట పాటు జరిగింది. ఆలోపు పరిటాల శ్రీరామ్ వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి వెళ్లిపోయారు. ఆ తరువాత గోనుగుంట్ల వర్గీయులు పూలమాల వేసి నివాళులర్పించారు.

విజేత జట్టుకు నగదు బహుమతి

నంబులపూలకుంట, జనవరి 18: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నాలుగురోజులుగా కందికుంట నారాయణమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంటు జరుగుతోంది. గురువారం కేజీ లెవన్, లెవన్ లడ్డు జట్లు తలపడ్డాయి. ఇందులో కేజీ లెవన్ జట్టు గెలుపొందింది. విన్నర్లకు రూ.20వేల నగదు, రన్నరప్‌కు రూ.పదివేల నగదు అందజేసినట్లు నిర్వాహకులు దండే గంగాశేఖర్ పేర్కొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

అమడగూరు, జనవరి 18: మండలంలోని రామనాథపురం గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యం కావడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బలరామయ్య తెలిపారు. ఎస్ఐ గురువారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. డిసెంబరు 22వ తేదీన వివాహిత మహిళ ఇంటినుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి రాలేదు. భర్త.. ఆమె ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. చివరకు తమకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

మృతుల కుటుంబాలకు పల్లె పరామర్శ

నల్లమాడ, జనవరి 18: మండలంలోని దొన్ని కోట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వేమారెడ్డి గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆగ్రామానికెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బుక్కపట్నం: టీడీపీ టౌన్ కన్వీనర్ జంగం వెంకటరాముడు పెద్దనాన్న జంగం నారాయణ అనారోగ్యతో మృతి చెందారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆయన నివాసానికెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. తర్వాత కుటుంబసభ్యులను పరామర్శించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తనకల్లు, జనవరి 18: మండంలోని సమస్యాత్మక గ్రామాలైన బాలసముద్రం, టి.సదుం, తనకల్లు పోలింగ్ కేంద్రాలను కదిరి డీఎస్పీ శ్రీలత, ఎస్ఐ రాజశేఖర్ గురువారం పరిశీలించారు. తనకల్లు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ రికార్డులు పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.

నవోదయ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ధర్మవరంరూరల్, జనవరి18: పట్టణంలో శనివారం జరిగే నవోదయ ప్రవేశపరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీఎస్ఆర్ బాలురపాఠశాల, ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు 485మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షకేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9గంటలకే విద్యార్థులు తమ హాల్‌టికెట్ తీసుకుని హాజరుకావాలని తెలిపారు.

హౌసింగ్ లబ్ధిదారులకు వడ్డీ రాయితీ జమ

పుట్టపర్తి, జనవరి 18: జిల్లాలో హౌసింగ్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీ రాయితీని వారి ఖాతాలకు జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో అందుకు సంబంధించిన రూ.1.58 కోట్ల మెగాచెక్కును ఆయన విడుదల చేశారు. జేసీ మాట్లాడుతూ.. ఒక్కో లబ్ధిదారు రూ.35వేలు వంతున 54,441 మంది రూ.191.80 కోట్లు బ్యాంకు ద్వారా లబ్ధి పొందారన్నారు. ఇందులో మొదటి దశలో 14,420 మందికి వడ్డీని రీయింబర్స్ చేశామన్నారు. హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఈఈ నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన సర్వే

పుట్టపర్తి, జనవరి 18: కులగణన సర్వే శుక్రవారం నుంచి ప్రారంభం కానుందని, దీనిని పగడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కులగణన సర్వేపై ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షించారు. జిల్లాలో శుక్రవారం నుంచి కులగణన ప్రారంభించాలన్నారు. ఇందులో వార్డు, గ్రామ, సచివాలయ ఉద్యోగులు పాల్గొనాలన్నారు. 19నుంచి 28వ తేదీ వరకు పదిరోజులపాటు మొబైల్ యాప్ ద్వారా డోర్‌టూ డోర్ సర్వే చేయాలన్నారు. పర్యవేక్షణ పగడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కోఆర్డినేటర్ శివారెడ్డి, సీపీఓ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

22న పాఠశాలలకు సెలవు ప్రకటించాలి

కొత్తచెరువు, జనవరి 18: ఈనెల 22 వ తేదీన అయోధ్య రామాలయంలో రాముడి విగ్రహప్రతిష్ఠ జరుగనుందని, ఆ రోజున పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఆపస్ ఉపాధ్యాయసంఘం నాయకులు డీఈఓ మీనాక్షికి గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీ వరకు ప్రభుత్వం పాఠశాలలకు సెలవు ప్రకటించిందన్నారు. ఇక 22న రాముని విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్నందున హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా సెలవు ప్రకటించే విధంగా ప్రభుత్వందృష్టికి తీసుకెళ్లాలని డీఈఓను కోరారు. వినతిపత్రం అందించినవారిలో ఆపస్ జిల్లా అధ్యక్షుడు చంద్రబాబు, ప్రధానకార్యదర్శిసురేశ్‌బాబు, గౌరవాధ్యక్షుడు భాస్కరయ్య, రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రప్రసాద్, గౌరవ సలహదారుడు అన్నంఅరవిందు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతులకు న్యాయం చేయండి

పుట్టపర్తి, జనవరి 18: దీర్ఘకాలికంగా సాగుచేస్తూ, పట్టాలున్న రైతుల భూములను ప్రభుత్వమే తిరిగి లాక్కోవడం సరికాదని, బాధిత రైతులకు న్యాయం చేయాలని మాజీ ఎంపీ నిమ్మలకిష్టప్ప ఆర్డీవో భాగ్యరేఖను కోరారు. జిల్లా కేంద్రంలోని పెద్దకమ్మవారిపల్లికి చెందిన రైతులు ఓబులేసు, వెంకటేష్, లింగప్ప, దారపనేని చంద్రశేఖర్, వెంకటరాముడు తదితరులు ఆర్డీవో కార్యాలయం చేరుకుని ఆర్డీవోకు భూసమస్యపై వినతిపత్రం అందించారు. వారికి నిమ్మల కిష్టప్ప మద్దతు తెలిపి మాట్లాడారు. పుట్టపర్తిలో సర్వేనెంబర్ 512లో 50ఎకరాల పొలంలో 26మంది రైతులకు భూ పంపిణీ కింద పట్టాలిచ్చారని తెలిపారు. అయితే సాగులో ఉన్న భూములను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కని ప్రభుత్వం తిరిగి లాక్కోవడం అన్యాయమన్నారు. భూములను స్వాధీనం చేసుకోవడంపై హైకోర్టులో వాజ్యం నడుస్తోందన్నారు. పెద్దకమ్మవారిపల్లినుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకు ఉన్న దారిని సైతం కబ్జా చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తతామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్ ఉన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే గుణపాఠం తప్పదు

ధర్మవరం, జనవరి 18: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానపరచిన వారికి గుణపాఠం తప్పదని టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్టీఓ కార్యాలయ ఆవరణలో గురువారం స్థానిక ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న డాక్టర్ అంబేడ్కర్ విదేశీ విద్య జీవన పథకాన్ని సీఎం జగన్ ప్రభుత్వం పేరు మార్చడం దళితులను అవమాన పరచినట్లేనన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్‌కు దళితులు ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీసీకొత్తకోట మాజీ సర్పంచ్ నరసింహులు, టీడీపీ సీనియర్ నాయకుడు అంజి, ఎస్సీసెల్ నాయకుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల స్పందన

పుట్టపర్తి, జనవరి 18: స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రభుత్వోద్యోగుల సమస్యలపై అర్జీల స్వీకరణ కార్యక్రమం స్పందన నిర్వహించనున్నట్లు డీఆర్వో కొండయ్య ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యోగులు తమ సర్వీసు, సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కాకండి

అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి శైలజ



సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి

హిందూపురం, జనవరి 18: మత్తు పదార్థాలకు బానిస కాకూడదని అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి శైలజ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ... మత్తు పదార్థాలకు బానిసలైన వారి ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయి బజారున పడ్డాయన్నారు. సెల్ ఫోన్ వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, సెల్‌ఫోన్ వల్ల అనర్థాలు పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీపీ ఇందాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్, ఆర్ఎంఓ రుక్మిణమ్మ, డాక్టర్ రాజగోపాల్, జీవన, ఏజీపీ శ్రీనివసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, సుధాకర్, ఈశ్వర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వద్ద మహిళ ఆందోళన



కోర్టు ఎదుట న్యాయం కోసం.. పద్మ

హిందూపురం, జనవరి 18: 'న్యాయాధికారి మేడమ్ గారూ.. నాకు న్యాయం చేయాలం'టూ ఓ మహిళ కోర్టు వద్ద నిరసన తెలిపారు. ఆమె తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సరస్వతి అనే మహిళ తన కుమార్తె పద్మకు ఆటోనగర్‌లో తన ఇంటిని పసుపుకుంకుమ కింద ఇచ్చింది. దానిని విజయలక్ష్మి అనే మహిళ తప్పుడు పత్రాలు సృష్టించి తనదే ఇల్లు అంటూ కొంతకాలంగా ఆ ఇంట్లో ఉంది. తహసీల్దార్, ఆర్డీఓ వద్ద కూడా ఇల్లు పద్మదేనని రుజువైంది. అయినా విజయలక్ష్మి ఇల్లు వదలలేదు. పద్మను ఇంటివద్దకు రానీయకుండా దౌర్జన్యం చేస్తోంది. ఈ విషయమై పద్మ కోర్టును ఆశ్రయించింది. తనకు సంబంధించిన ఇంటి పత్రాలు ఒరిజినల్స్‌తో ఇంటిపై గతంలో లోన్‌కూడా తీసుకుంది. ఇన్ని ఉన్నా విజయలక్ష్మి ఇల్లు వదలలేదని పద్మ వాపోయింది. విజయలక్ష్మి వద్ద తాము చీటీ వేశామనీ, అప్పట్లో కాగితంపై సంతకాలు పెట్టించుకుని ఇంటికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించిందన్నారు. ఆఖరికి కోర్టుకు వెళ్లినా కోర్టులో తన కేసుకు సంబంధించిన కట్ట మాయమైందని ఆ కేసు కట్ట ఇప్పించాలని న్యాయవాదిని కోరినా న్యాయం జరగలేదన్నారు. న్యాయాధికారి అయినా న్యాయం చేయాలని కోరుతూ కోర్టువద్ద నిరసన తెలిపినట్లు పద్మ అన్నారు. విషయాన్ని కోర్టు సిబ్బంది న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన న్యాయాధికారి వెంటనే ఆమెవద్ద పోలీసులు ఫిర్యాదు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో పద్మ అక్కడి నుంచి టూటౌన్ పోలీస్‌ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది.

'చెక్‌డ్యాంలతో భూగర్భ జలాల వృద్ధి'

చిలమత్తూరు, జనవరి 18: చిత్రావతి నదిపై నిర్మించిన చెక్‌డ్యాంలతో భూగర్భజలాలు బాగా వృద్ధి చెందాయని సెహగల్ ఫౌండేషన్, కోకాకోలా ఇండియా ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. మండలంలోని కోడూరు, సుబ్బరావుపేట, మధురేపల్లి రైతులతో వారు గురువారం సమావేశమయ్యారు. రైతులతో సంస్థల ప్రతినిధులు ముఖాముఖి మాట్లాడారు. గతంలో కంటే చెక్‌డ్యాంల నిర్మాణం తరువాత కలిగిన ఫలితాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ చెక్‌డ్యాంల నిర్మాణంతో తమకు ఎంతో మేలు జరిగిందని, భూగర్భజలాల మట్టం బాగా పెరిగి బోరుబావుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నాయన్నారు. తద్వారా పంటలను సాగుచేసుకోవడానికి అవకాశం కలిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి అంజిలీ ముఖిజా, స్థానిక సర్పంచ్ మురళి, రైతులు అంజినరెడ్డి, వెంకటేష్, రాజశేఖర్ తదితరలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రసాద్ నాయక్ (ఫైల్)

పెనుకొండ టౌన్, జనవరి 18 : అనారోగ్యంతో బాధపడుతున్న ఎనిమిదేళ్ల కుమార్తె మందుల కోసం వెళ్తున్న ప్రసాద్ నాయక్ (30) అనే వ్యక్తి గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రసాద్‌నాయక్ సోమందేపల్లి మండలం చల్లాపల్లిలో నివాసముంటున్నాడు. మృతునికి భార్య శ్యామల, కుమార్తె అనుశ్రీ ఉన్నారు. సోమందేపల్లిలో మగ్గం పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుమార్తెకు వారం నుంచి జ్వరం వస్తుండటంతో మందులు తీసుకురావడానికి ద్విచక్రవాహనంలో పెనుకొండకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఆర్టీఓ చెక్‌పోస్టుర్ల సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద వెనుక వస్తున్న ఐషర్ వాహనం ముందు వెళ్తున్న ప్రసాద్ నాయక్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ప్రసాద్ నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో భార్య, కుమార్తె రోదనలు మిన్నంటాయి.



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హిందూపురం రూరల్ నాయకులు



పెనుకొండలో ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సవిత



మిట్టమీదపల్లి వద్ద అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు ఎన్టీఆర్

ఘన నివాళులర్పించిన టీడీపీ నాయకులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

తెలుగు ప్రజల గుండెల్లో నందమూరి తారకరామారావు చిరస్మరణీయుడుగా ఉంటాడని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని హిందూపురం, మడకశిర, పెనుకొండ పట్టణాలతో పాటు ఆయా నియోజకర్గాల్లోని మండలకేంద్రాలలో ఘన నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

హిందూపురంలో... పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి విశేష అలంకరణ చేశారు. పూలమాలలు వేసి ఎన్టీఆర్‌కు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఎప్పటికీ తెలుగు ప్రజల మనసులో నిలిచిపోయే మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. నియోజకవర్గంలో గుర్తుండిపోయే కార్యక్ర మాలు ఎన్నో చేపట్టారన్నారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా మిట్టమీదపల్లి వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ హెచ్ఎన్ రాము ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి : బీకే

పెనుకొండలో.. తెలుగుజాతి కీర్తి పతాకాన్ని ప్రపంచ వ్యాప్తంగా సగర్వంగా నిలిపిన మహా మనిషి మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఊరేగింపుగా వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీకే కుమారుడు సాయి కల్యాణ్, నాయకులు మునిమడుగు వెంకటరాముడు, కేశవయ్య, కురుబ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల గుండె చప్పుడు ఎన్టీఆర్ : సవిత

తెలుగు ప్రజల గుండెల్లో నిండుగా ఉన్న మహానాయకుడు దివంగత ఎన్టీరామారావు అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన సినీ, రాజకీయ జీవిత చరిత్రకు సంబంధించి పుస్తకావిష్కరణ చేశారు. వెయ్యి పుస్తకాలను ప్రింట్ తీయించి ప్రజలకు ఆయన అభిమానులకు, కార్యకర్తలకు అందించారు. అనంతరం అన్న క్యాంటిన్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

గోరంట్లలో... ఎన్టీరామారావు వర్ధంతిని మండలకేంద్రంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీ నిమ్మల క్రిష్టప్ప తన అనుచరులతో ర్యాలీగా వెళ్లి బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల లు వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. టీడీపీని స్థాపించి పేదల సంక్షేమ కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే అన్నారు. అవే పథకాలను పేర్లు మార్చి నేడు అమలు చేస్తున్నారన్నారు. పలువురు టీడీపీ నాయకులుఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుప్రతిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంచిపెట్టారు. మండల కన్వీనర్ సోముశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఎన్టీఆర్: మాజీ ఎమ్మెల్యే ఈరన్న

మడకశిరలో... తెలుగు ప్రజల కీర్తిని నలుదిక్కుల చాటిచెప్పి, రాష్ట్ర అభ్యున్నతి కోసం ఎన్టీరామారావు చేసిన కృషి మరువలేనిదని, దేశంలోనే మొట్టమొదటి సారిగా పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న అన్నారు. మడకశిరలో గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ మహానాయకుడన్నారు. ప్రతిపే దవాడికి కూడు,గూడు, గుడ్డ అన్న నినాదంతో ఎన్నో సంక్షేమ పథకాలు అందించిన గొప్పవ్యక్తిగా అభివర్ణించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వక్కలిగ సాధికరత కన్వీనర్ పాండురంగప్ప తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా లేపాక్షి, సోమందేపల్లి, చిలమత్తూరు, రొద్దం, అమరాపురం, రొళ్ల, అగళి, గుడిబండ మండల కేంద్రాల్లో స్థానిక నాయకుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు.



గుడిబండలో...



మడకశిరలో నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



అగళిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద...



రొళ్లలో టీడీపీ నాయకుల నివాళి



గోరంట్లలో టీడీపీ నాయకుల నివాళి



చిలమత్తూరులో..



అమరాపురంలో..

దేవాలయ భూముల్లో నిర్మాణాలు

మంత్రివద్ద మొరపెట్టుకునేందుకు వచ్చిన ఆలయ కమిటీ సభ్యులు

అడ్డుకున్న పోలీసులు



ఆలయ కమిటీ సభ్యులను అడ్డుకుంటున్న ఎస్ఐ విజయ్‌కుమార్

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), జనవరి 18: సోమందేపల్లి మండలం తుంగోడు గ్రామ రంగనాథస్వామి దేవాలయ భూముల్లో ప్రభుత్వ భవన నిర్మాణాలు చేపట్టి పూర్తి చేశారు. వాటిని మంత్రి ఉషశ్రీ గురువారం ప్రారంభించారు. దీనిపై మంత్రికి మొరపెట్టుకునేందుకు వచ్చిన రంగనాథస్వామి ఆలయ కమిటీ సభ్యులను పోలీసులు ముందస్తు గానే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు హనుమంతరాయుడు, రంగప్ప, శివన్న, రామక్రిష్ణ, సిద్ద గంగయ్య, నాగరాజు మాట్లాడుతూ... సోమందేపల్లి మండలం తుంగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని 72-1సర్వే నంబరులో 6.38ఎకరాల భూమి ఆలయం పేరిట ఉందన్నారు. ఈ భూమి ద్వారా వచ్చే సొమ్ముతో ఆలయ అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. అయితే అధికార పార్టీ వైసీపీ నాయకులు ఈ దేవాలయ భూమిలో సచివాలయం, రైతు భరోసాకేంద్రం, వైఎస్ఆర్ ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు చేపట్టడంతో పాటు వారికిఅనుకూలంగా ఉన్న 16మందికి ఆ దేవుడి భూమిలో పట్టాలు ఇచ్చారన్నారు. నాలుగు సంవత్సరాల కిందట కోర్టులో కేసు కూడా వేశామన్నారు. కోర్టు తుది తీర్పు వచ్చేదాకా సచివాలయ ప్రారంభోత్సవాన్ని ఆపాలని మంత్రికి మొర పెట్టుకుందామని వచ్చామన్నారు. అయినా పోలీసులు నిర్బంధించి మంత్రికి మొర పెట్టుకునేందుకు వీలులేకుండా వెనక్కు పంపించారన్నారు. దేవుడి భూముల్లో నిర్మాణాలపై ప్రశ్నించే నాథుడే లేడన్నారు. ఇప్పటికైనా ఆలయ భూముల్లో ఆ 16 మందికి ఇచ్చిన ఇళ్ల పట్టాలు రద్దు చేసి, ఇతర ఏ నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి పలువురి చేరిక



కమ్మవారిపల్లి వాల్మీకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీకే పార్థసారథి

పెనుకొండ, జనవరి 18: గోరంట్ల మండల పరిధిలోని కోట కమ్మవారిపల్లికి చెందిన 50వాల్మీకి కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కమ్మవారిపల్లికి చెందిన గుర్రోళ్ల శ్రీనివాసులు, మునీంద్ర, భీముడు, నాగరాజు, ప్రసాద్ ఆధ్వర్యంలో 50వాల్మీకి కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి బీకే పార్థసారథి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన వారు మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు సముచిత న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. బడుగు బలహీనవర్గాల పార్టీ టీడీపీ అన్నారు. బీకే పార్థసారథి నాయకత్వంలో బీసీలకు న్యాయం జరుగుతుందనే నమ్మకంతో పార్టీలో చేరుతున్నామన్నారు. టీడీపీ విజయానికి తాము శక్తివంచనలేకుండా కృషిచేస్తామన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు వడ్డీ రాయితీ జమ

పుట్టపర్తి, జనవరి 18: జిల్లాలో హౌసింగ్ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీ రాయితీని వారి ఖాతాలకు జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో అందుకు సంబంధించిన రూ.1.58 కోట్ల మెగాచెక్కును ఆయన విడుదల చేశారు. జేసీ మాట్లాడుతూ.. ఒక్కో లబ్ధిదారు రూ.35 వేలు వంతున 54,441 మంది రూ.191.80 కోట్లు బ్యాంకు ద్వారా లబ్ధి పొందారన్నారు. ఇందులో మొదటి దశలో 14,420 మందికి వడ్డీని రీయింబర్స్ చేశామన్నారు. హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఈఈ నాగరాజు పాల్గొన్నారు.

వీరేంద్రహెగ్డేకు క్షీరాభిషేకం

రొళ్ల, జనవరి 18: మండల కేంద్రంలో గురువారం ధర్మస్థల మంజునాథస్వామికి, వీరేంద్ర హెగ్డేకు క్షీరాభిషేకం చేశారు. ఏపీలో వెనకబడిన ప్రాంతమైన మడకశిర నియోజకవర్గాన్ని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అభ్యర్థన మేరకు ధర్మస్థల గ్రామీణాభివృద్ధి ట్రస్టు దత్తత తీసుకునేందుకు ఆ ట్రస్టు చైర్మన్ వీరేంద్ర హెగ్డే ముందుకొచ్చిన విషయం విదితమే. దీంతో మండల నాయకులు, ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, నాయకులు సిద్దగంగప్ప, ఈరన్న, రాజకుమార్, మారన్న, నాగరాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

'అర్చకులకు ఆర్థికసాయం అందివ్వాలి'

మడకశిరటౌన్, జనవరి 18: లోక కల్యాణ్‌ప్రజాసాక్షి సమితి ఆధ్వర్యంలో హిందూ ధర్మ దేవాలయాల్లో పూజలు నిర్వహిస్తున్న అర్చకులకు ధూప దీప నైవేద్యం ఆర్థిక సాయం నెలనెలా అందివ్వాలని కోరుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రాన్ని అందజేశారు. అర్చక సంఘం నియోజక వర్గం అధ్యక్షులు సుబ్బరాయుడు, నాయకులు ప్రకాష్, నాగేష్, రమేష్, నాగరాజు, సురేష్, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డవారిని గుర్తించడం లేదు

వైసీపీ ముందులా లేదు

ఐదేళ్ల నుంచి మీ అపాయింట్‌మెంట్ దొరకలేదు

సీఎం జగన్ తీరుపై సానె ఉమారాణి విమర్శలు



హిందూపురం, జనవరి 18: పార్టీకోసం కష్టపడిన వారిని గుర్తించడం లేదని, పార్టీ మునుపటిలాగా లేదని వైసీపీ పెనుకొండ నాయకురాలు సానె ఉమారాణి సోషల్ మీడియా వేదికగా సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించారు. ఈ మేరకు ఓ వీడియోను విడుదల చేశారు. పెనుకొండ మాజీ ఎమ్మెల్యే కనముక్కల చెన్నారెడ్డి కూతురు ఆమె. వైసీపీ ఆవిర్భావం నుంచి ఎంతో కష్టపడ్డానని, జగన్ జైల్లో ఉన్నప్పుడు ఎంతో మందితో కలిసి దీక్షలు, నిరసనలు ప్రదర్శనలు చేశానని ఆమె పేర్కొన్నారు. ధర్మవరం, అనంతపురంలో జరిగిన నిరసన దీక్షల్లో నేను పాల్గొన్నాను. కానీ తనలాంటి వారికి కాకుండా, టీడీపీ నుంచి వచ్చిన వారికి పార్టీలో పెద్ద పీట వేశారని విమర్శించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపు లేదని, తన తండ్రి చెన్నారెడ్డి, అన్న ఎస్వీ రమణారెడ్డి రాజకీయాలకు బలయ్యారని ఆమె గుర్తు చేసుకున్నారు. ఏ ఒక్కరివద్ద ఒక్క పైసా తీసుకోలేదని, పార్టీలో వర్గ విభేదాలకు తమను బలిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 'మీరు సీఎం అయ్యాక.. మీ అపాయింట్ మెంట్ కోసం వేచిచూశాను. మిమ్ములను కలవాలని కేఎన్ఆర్‌ను అపాయింట్‌మెంట్ కోరితే.. వారం పది రోజులు ఆగాలని చెప్తూ వచ్చాడు. చివరికి ఫోన్ కూడ ఎత్తడం లేదు. మీ అపాయింట్ కోసం ఎందరినో అడిగాము. కానీ ఇవ్వలేదు. మహిళలను ఇబ్బంది పెట్టడం బాగలేదు. కష్టపడిన వారికి అవకాశం ఇవ్వండి. మమ్ములను ఇబ్బంది పెట్టకండి. అనంతపురం జిల్లాలో 20 ఎకరాలు భూమి ఉన్న వారు కూడా పేదలుగానే ఉన్నారు. కానీ భూమి ఎక్కువగా ఉందని వారికి రేషన్ కార్డులు, పింఛన్ తొలగించారు. వారంతా ఎంతో ఆవేదనకు గురవుతున్నారు. పెనుకొండకు వెళ్లి తిరగమంటే తిరిగాను. కానీ మొండిచెయ్యే మిగిలింది. కార్యకర్తగా పనిచేస్తేనే నాయకులు ఎలాగ ఉండాలో తెలిస్తుంది. మిమ్ములను కలిసేందుకు అవకాశం లేకపోవడంతో పార్టీ పరిస్థితి, నాయకుల తీరు చెప్పడానికి ఈ విడియో చేస్తున్నా' అని జగన్‌ను ఉద్దేశించి ఉమారాణి అన్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి చేసిన కార్యక్రమాలు, జగన్ పత్రికలో వచ్చిన కథనాలను జోడిస్తూ ఆమె వీడియో చేశారు.



గుడిబండలో అంగన్‌వాడీల సమ్మెకు టీడీపీ నాయకుల మద్దతు



గోరంట్లలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

సమస్యల పరిష్కారం కోరుతూ అంగనవాడీలు చేపట్టిన సమ్మె 38వ రోజుకు చేరుకుంది. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సేవలు చేస్తున్న అంగన్‌వాడీలను ఇలా వేధించడం తగదంటూ అంగన్‌వాడీలు ఆవేదన చెందారు. ఇలా వేధించే కంటే ఒక్క సారిగా పీక పిసికి చంపండి అంటూ తమ గొంతులు పట్టుకుని పురంలో నిరసన తెలిపారు. స్థానిక సద్భావన్ సర్కిల్‌లోని పాత బీపీఎల్ షోరూం ఎదుటు నిర్వహిస్తున్న నిరసన కొనసాగింది. తమ న్యాయపరమైన డిమాండ్ల పై 38 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీడీపీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. చిలమత్తూరులో అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు పలికారు. అంగన్‌వాడీలు ధైర్యంగా ఐకమత్యంతో పోరాటం సాగించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. గోరంట్లలోని అంగన్‌వాడీ దీక్ష శిబిరం వద్దకు వచ్చిన ఆయన మాట్లాడారు. విజయవాడలో జరుగుతున్న అమరణ నిరాహారదీక్ష జయప్రదం కావడానికి మీవంతు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మురక్కంగా వ్యవహరిస్తున్నారని, అంగన్‌వాడీలు తగ్గకుండా సమ్మెను నడిపించాలన్నారు. పెనుకొండలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో మోకాళ్లపై కూర్చుని అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగనవాడీల సమస్యలు పరిష్కరించడంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్, టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప విమర్శించారు. వారు గుడిబండలో అంగన్‌వాడీల దీక్షలకు మద్దతు తెలిపారు. అలాగే అగళి, మడకశిర, సోమందేపల్లి, రొద్దం తదితర చోట్ల అంగన్‌వాడీలు తమ నిరసన కొనసాగించారు